



తెలంగాణభవన్‌లో మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పోచారం, కడియం. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పార్టీ నేతలు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు... సమావేశానికి హాజరైన లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు

# అదానీతో కాంగ్రెస్ దొంగాట

▶ మొదటిపేజీ తరువాయి...

మారటానికి కారణాలేంటో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క గులాబీ సైనికుడిపై ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ బలం, గళం బీఆర్‌ఎస్సేనని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్‌ఎస్‌ను ఓడించాలని బీజేపీ నేత బండి సంజయ్ చేసిన ప్రకటన ఆ రెండు పార్టీల లోపాయికారి ఒప్పందానికి నిదర్శనమని విమర్శించారు.

**6 నెలల్లో ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు**


కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా మొత్తం 420 హామీలు ఇచ్చిందని, వాటిని ఆరు నెలల్లో అమలు చేయకపోతే ప్రభుత్వం ప్రజల నుంచి తిరుగుబాటును ఎదుర్కోవాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ 420 హామీలను ఎప్పటికప్పుడు ప్రజలకు గుర్తుచేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం కార్యకలాపాలపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపై స్పందించకపోతే ప్రజలు అపోహపడే ప్రమాదం ఉన్నదని, అందుకే వాస్తవాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. 'డిసెంబర్ 9వ తేదీలోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీనే గుర్తుచేస్తున్నాం. రైతుబంధు రూ.15 వేలకు పెంచి ఇస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తున్నాం. రూ.2 వేల పింఛన్‌ను రూ.4 వేలు చేస్తామన్న రేవంత్ హామీని మాత్రమే గుర్తుచేస్తున్నాం' అని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు చెల్లిస్తామని ప్రియాంకగాంధీ స్పష్టంగా చెప్పినా, అసెంబ్లీ సాక్షిగా ఆ హామీని తాము ఇవ్వలేదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అబద్ధం చెప్పారని మండిపడ్డారు. రుణమాఫీ ఒకేసారి సాధ్యం కాదని, దశల వారీగా అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి చెప్పటంపై కేటీఆర్ తీవ్రంగా ఆక్షేపించారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధిస్తామని చెప్పిన సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్ కేంద్ర జలవనరుల మంత్రిని కలిసిన తర్వాత హోదా సాధ్యం కాదని చెప్పటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా తేవటం తమ వల్ల కాదని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందనే విషయాన్ని ఉమ్మడి పాలమూరు ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. మహబూబ్‌నగర్‌ను ఆనుకునే ఉన్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కర్ణాటకలో జాతీయ హోదా ఇచ్చిన బీజేపీని నిలదీసే ప్రయత్నం సీఎం రేవంత్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు.

**పంచాయతీ నుంచి పార్లమెంట్‌దాకా..**

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా బలమైన సైన్యం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్‌కు ఉన్నంత ప్రాతినిధ్యం ఇతర ఏ పార్టీకి లేదని చెప్పారు. 60 లక్షల సభ్యత్వాలున్న పార్టీ కూడా మరొకటి లేదని పేర్కొన్నారు. చిన్నచిన్న లోపాలను సవరించుకొని తిరిగి పడిలేచిన కెరటమై గులాబీ సైన్యం ప్రజల ఆశీర్వాదాన్ని పొందేందుకు అహర్నిశలు కృషి చేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో విజయతీరాలు చేరటం పెద్ద కష్టమేమీ కాదని అన్నారు. పార్టీపై గతంలో జరిగిన దుష్ప్రచారాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపైనే ఉన్నదని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అన్నీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలో వేసిన ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. ఇలా చేయటం వల్ల ప్రభుత్వం, పార్టీ అనే తేడాను ప్రజలు తెలుసుకోలేకపోయారని చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో పింఛన్ల కోసం సంవత్సరానికి రూ.800 కోట్లు ఖర్చు చేస్తే, కేసీఆర్ సర్కార్ రూ.11,700 కోట్లు ఖర్చు పెట్టిందని కేటీఆర్ వివరించారు. ఈస్థాయిలో భారీగా పింఛన్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు అందించినా వాటి గురించి చెప్పుకోవడంలో విఫలమయ్యామని పేర్కొన్నారు. త్వరలో పార్టీ అన్ని స్థాయిల్లో కమిటీలు వేస్తామని, ఆ తరువాత క్యాడర్‌కు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యకర్తల అభిప్రాయాల మేరకు కార్యక్రమాల రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. కేసీఆర్ సర్కార్ తెలంగాణను బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు అప్పగించిందని తెలిపారు. ఈ సమావేశంలో అసెంబ్లీ మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీనేత కే కేశవరావు, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ నేతలు ఎర్ర శేఖర్, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, వాల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### రైతులు మళ్లీ క్యూలోనా?

**కేసీఆర్** సర్కార్ హయాంలో పదేండ్లపాటు రైతులు సంతోషంగా వ్యవసాయంపై దృష్టిపెట్టి అద్భుతమైన పంటలు పండించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా కాక ముందే రైతులు రోడ్డెక్కారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కోసం లైన్లో నిలబడే పరిస్థితులు మళ్లీ వచ్చాయని అన్నారు. ఎరువులను పోలీస్‌స్టేషన్‌లో పెట్టి పంచే పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. రైతుబంధు సొమ్ము ఎంతమందికి పడిందో తెలియని దారుణ పరిస్థితి నెలకొన్నదని తెలిపారు.




## 'వీఆర్‌ఏల విలీన సమస్యలు పరిష్కరించండి'

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): వీఆర్‌ఏల విలీన సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ట్రెసా కేంద్ర సంఘం విజ్ఞప్తి చేసింది. గురువారం సంఘం ప్రతినిధులు మంత్రిని కలిసి పెండింగ్ సమస్యలను మంత్రికి విన్నవించారు. వివిధ కారణాలతో పోస్టింగ్ ఇవ్వని వీఆర్‌ఏలకు వెంటనే ఇవ్వాలని కోరారు. 61 ఏండ్లు పైబడిన వీఆర్‌ఏల కుటుంబసభ్యులకు వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, 55-61 ఏండ్ల మధ్య వయసున్న వీఆర్‌ఏల వారసులకూ ఉద్యోగాలు కల్పించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఇతర శాఖలకు బదలాయించిన వారిని తిరిగి రెవెన్యూ శాఖలో అదే కేడర్‌లో తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలో అన్ని సమస్యలను అంశాలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ట్రెసా అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ తెలిపారు.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 15.3°c | 33.6°c |
| ఆదిలాబాద్ | 17.2°c | 31.3°c |
| మెదక్ | 17.3°c | 32.7°c |
| నల్లగొండ | 17.6°c | 29.5°c |
| వరంగల్ | 19.0°c | 31.0°c |
| ఖమ్మం | 19.0°c | 31.0°c |
| కరీంనగర్ | 19.0°c | 31.0°c |
| హైదరాబాద్ | 19.3°c | 31.3°c |
| మహబూబ్‌నగర్ | 19.9°c | 31.3°c |
| నిజామాబాద్ | 20.2°c | 31.9°c |

### బీఆర్‌ఎస్‌ను వీడను: అరూరి

నయీంనగర్, జనవరి 18: తాను బీఆర్‌ఎస్‌ను వీడుతున్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ తెలిపారు. గురువారం ఆయన హనుమకొండ ప్రశాంత్ నగర్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 2012లో పీఆర్పీ విలీనం తర్వాత ఉద్యమ నేత కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్‌లో చేరానని, అప్పటి నుంచి క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా పార్టీ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు.

# త్వరలో ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ

- పార్టీ మండలి నాయకుడి ఎన్నిక
- గ్రామస్థాయి నుంచే పునర్నిర్మాణం
- లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్సీలే కీలకం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): పార్టీ అధినేత కేసీఆర్ త్వరలో ఎమ్మెల్సీలతో సమావేశమవుతారని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆ సమావేశంలోనే శాసనమండలిలో పార్టీ నాయకుడి ఎంపిక ఉంటుందని చెప్పారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్సీల భాగస్వామ్యం, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. ఎమ్మెల్సీలు పార్టీకి కండ్లు, చెవుల మాదిరి పనిచేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలు కోసం శాసనసభలో పార్టీ తరఫున ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోరు ఖాయమని, అప్పుడు బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు అవకాశాలే ఎక్కువగా ఉంటాయని వివరించారు. అన్ని స్థాయిల్లో పార్టీ క్యాడర్‌ను ఏకతాటిపైకి తేవటంలో ఎమ్మెల్సీలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. పార్టీని గ్రామస్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకు పునర్వ్యవస్థీకరించాలనేది పార్టీ అధినేత కేసీఆర్ ఆలోచనా విధానమని, అందుకు అనుగుణమైన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. చురుకైన నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని చెప్పారు. జిల్లా పార్టీ కార్యాలయాల కేంద్రంగా కార్యక్రమాలు చేపట్టనున్నామని చెప్పారు. పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకు అభ్యర్థుల విజయానికి అన్ని రకాల వ్యూహాలు, ఎత్తుగడలను అనుసరించాలని సూచించారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, సురభి వాణీదేవి, సిరికొండ మధుసూదనాచారి, భానుప్రసాద్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్ రాజు, ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎల్ రమణ, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, దండె విఠల్, నవీన్‌కుమార్, దయానంద్, గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, యెగ్గె మల్లేశం, చల్లా వెంకట్రామ్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు బెదిరేది లేదు

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**



హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలపై పెడుతున్న అక్రమ కేసులకు బెదిరేది లేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టంచేశారు. చట్టాలకు, నిబంధనలకు లోబడి పోలీసులు వ్యవహరించాలే తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్తే కేసులు పెట్టడం సరికాదని సూచించారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ నేతలు రావుల శ్రీధర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించి తద్వారా రాజకీయ లబ్ధిపొందాలని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉద్దేశపూర్వంగా బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నదని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపైనే కాకుండా సాక్షాత్తు తనపై, తన కుటుంబసభ్యులపై నియోజకవర్గంలోని ఓ రౌడీషీటర్‌తో ప్రైవేటు ఫిర్యాదు ఇప్పించి కేసు నమోదు చేయించారని ఆరోపించారు. భూపాలపల్లిలో ఆలయం కడితే ప్రస్తుత ఎమ్మెల్యే ఒత్తిడితో తనకు నోటీసులిస్తే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నామని చెప్పారు. భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, ఆలయం అన్నీ ఒకే సర్వే నంబర్‌లో ఉన్నాయని వివరించారు. గుడిని ఆనుకునే ఆలయ అవసరాల కోసం నిర్మించామని, అది ఆలయం ఆస్తి తప్ప తన సొంత ఆస్తి కాదని చెప్పారు. ప్రభుత్వ భూమిలోనే గుడి కట్టామని వివరించారు. తనపై కేసులు పెట్టి జైలుకు పంపినా వెళ్తామే కానీ, భయపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విపక్ష నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు.

### మాజీ ఎమ్మెల్యే గండ్రపై కేసు

భూపాలపల్లి రూరల్, జనవరి 18: కోర్టు ఆదేశాలతో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సహా ఏడుగురిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై సంధ్యారాణి తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని పుల్లూరి రామయ్యపల్లి శివారు చెరువు శిఖంలో అక్రమ నిర్మాణం చేపట్టారని నాగవెల్లి రాజలింగమూర్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతి, గండ్ర గౌతమ్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, సెగ్గం సిద్ధు, కొత్త హరిబాబు, గండ్ర హరీశ్‌రెడ్డిపై కేసు నమోదైనట్టు ఆమె పేర్కొన్నారు.

# తులం బంగారం ఏమైంది?

- కల్యాణలక్ష్మి చెక్కులు పాతవే ఇస్తున్నరు
- కాంగ్రెస్ హామీల అమలు ప్రశ్నార్థకమే
- 420 హామీలను అమలు చేస్తరో? లేదో?
- లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు మావే
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడి



గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి చెక్కులు పాతవే ఇస్తున్నారని, ఆడబిడ్డలకు ఇచ్చిన తులం బంగారం హామీ ఏమైందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లోని 420 హామీలను అమలు చేస్తరా చెయ్యరా? అన్నది ప్రశ్నార్థకంగా ఉన్నదని అనుమానం వ్యక్తంచేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తే మొదట సంతోషపడేది తామేనని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూములను గుంజుకుంటుందని కాంగ్రెస్ విషప్రచారం చేసిందని దుయ్యబట్టారు. తెలంగాణ సాధనలో, అనంతరం రాష్ట్ర పునర్నిర్మాణంలో తామంతా కేసీఆర్ వెంట సైనికుల్లా పనిచేశామని చెప్పారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటామని వెల్లడించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని, ఆ దిశగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణను అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూపొందిస్తున్నారని వెల్లడించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ బలంగా ఉన్నదని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో 2009, 2014, 2019లో వరుసగా బీఆర్‌ఎస్ విజయం సాధించినట్టే రానున్న ఎన్నికల్లోనూ చరిత్ర సృష్టిస్తామని వెల్లడించారు. 2009లో కేసీఆర్ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ స్వరాష్ట్ర కల సాకారమైందని గుర్తుచేశారు. పార్లమెంటులో తెలంగాణ తరఫున బలమైన గొంతుక వినబడాలంటే బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలనే ఆలోచన ప్రజల్లో ఉన్నదని చెప్పారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని అనేక హామీలను అమలు చేశారని వివరించారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా వంటి అనేక పథకాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు కాదనే విషయం ప్రజల అనుభవంలో ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తామంతా నిరంతరం ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు తమ అధినేత కేసీఆర్ అన్నీ ఆలోచించి అభ్యర్థులను ప్రకటిస్తారని, అంతిమంగా పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా తామంతా కష్టపడి పనిచేస్తామని స్పష్టంచేశారు. సమావేశంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, రామ్మోహన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### సీఆర్‌పీఎఫ్‌లో..

**సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) స్పోర్ట్స్ కోటాలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- మొత్తం ఖాళీలు: 169
- పోస్టులు: కానిస్టేబుల్ (గ్రూప్ సీ)
- క్రీడాంశాలు: జిమ్నాస్టిక్స్, షూటింగ్, బాక్సింగ్, ఆర్చరీ, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ తదితరాలు
- అర్హతలు, ఎంపిక తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 15
- వెబ్‌సైట్: https://crpf.gov.in

### ఎన్‌ఎండీసీ సీఎస్‌ఆర్‌లో...

**ఎన్‌ఎండీసీ సీఎస్‌ఆర్ ఫౌండేషన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 16
- పోస్టులు: హెడ్, ప్రాజెక్ట్ మేనేజర్, ఆఫీస్ మేనేజర్ బ్లాక్ కోఆర్డినేటర్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 31
- వెబ్‌సైట్: www.nmdc.co.in

### దివ్యాంగజన్‌లో..

**న్యూఢిల్లీలోని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పర్సన్స్ విత్ ఫిజికల్ డిజేబిలిటీస్ (దివ్యాంగజన్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: ఏవో, ఫిజియోథెరపిస్ట్, ఎల్‌డీసీ, స్టాఫ్ కార్ డ్రైవర్ తదితరాలు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 26
- వెబ్‌సైట్: www.iphnewdelhi.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జాగ్రఫీ, ఫిజిక్స్, ఎకానమీ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

## నేటినుంచి ఐఐటీహెచ్‌లో 'ఇన్వెంటివ్-24'

**ఫెయిర్‌లో 120 కొత్త ఆవిష్కరణలు**

**2 వేల మంది పారిశ్రామిక ప్రతినిధుల రాక**

సంగారెడ్డి, జనవరి 18 (నమస్తే తెలంగాణ): కొత్త ఆవిష్కరణలతో దూసుకెళ్తున్న ఐఐటీ హైదరాబాద్.. తాజాగా జాతీయ స్థాయి మెగా ఇన్నోవేషన్ ఫెయిర్‌కు వేదిక కానుంది. కేంద్ర విద్యాశాఖ ఏటా నిర్వహించే మెగా ఇన్నోవేషన్ ఫెయిర్.. ఈ ఏడాది 'ఇన్వెంటివ్-2024' పేరిట సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శుక్ర, శనివారాల్లో జరగనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ శుక్రవారం ఉదయం వర్చువల్‌గా దీనిని ప్రారంభిస్తారు. ఈ ఫెయిర్‌లో 23 ఐఐటీలు, బెంగళూరులోని ఐఐసీ, ఐఐఐటీలు, ఎన్‌ఐటీలు పాల్గొనున్నాయి. 50కిపైగా సాంకేతిక విద్యాసంస్థలు 120 ఆవిష్కరణలను ప్రదర్శించనున్నాయి. దేశంలోని 2 వేల మంది పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు. కార్యక్రమానికి ఐఐటీ హైదరాబాద్ గవర్నింగ్ బాడీ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీ డైరెక్టర్ మూర్తి పాల్గొంటారు.

## యాదాద్రి పవర్‌ప్లాంట్‌పై వచ్చేనెల 20న ప్రజాభిప్రాయ సేకరణ

దామరచర్ల, జనవరి 18: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం సమీపంలో రూ.29,965 కోట్లతో చేపట్టిన 4 వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ ప్లాంట్‌పై తిరిగి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి తెలిపారు. ఫిబ్రవరి 20న ఉదయం 11 గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే థర్మల్‌ప్లాంట్ 80 శాతం పనులు పూర్తయ్యాయి. వీటిలో 2 ప్లాంట్లు విద్యుత్తు ఉత్పత్తికి సిద్ధం కాగా వీటిపై కొన్ని సంస్థలు కేసులు వేశాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖలు మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని నిర్ణయించాయి.

# రేవంత్ చెలగాటం.. కాంగ్రెస్‌కు సంకటం

- అదానీతో రేవంత్ దోస్తానాపై దిక్కుతోచని కాంగ్రెస్ పార్టీ
- మీడియా ప్రశ్నలకు జవాబు చెప్పలేని స్థితిలో అధిష్ఠానం
- పార్టీ పెద్దల అసహాయ స్థితిపై సోషల్ మీడియాలో పోస్టులు వైరల్

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): దేశంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా అధికార బీజేపీని ఇరుకున పెట్టేందుకు బడా పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని బూచిగా వాడుకుంటున్నది. కొన్ని వేల కోట్ల రూపాయల విలువైన వ్యాపార సామ్రాజ్యాన్ని నడుపుతున్న అదానీపై పలు కుంభకోణాలకు సంబంధించిన ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెల్సిందే. వీటిపై పలు జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు ఇప్పటికే అనేక కథనాలను ప్రచురించాయి. అదానీ అక్రమ సంపాదనకు ప్రియ మిత్రుడు ప్రధాని మోదీ, ఆయన పరివారం అండదండలందించారంటూ గత కొన్నేండ్లుగా కాంగ్రెస్ పార్టీ నేతలు దుమ్మెత్తిపోస్తున్నారు. దేశంలో ప్రజల కష్టాల కడగండ్లకు మోదానీలే (అదానీ+మోదీ) కారణమని ఆరోపిస్తూ.. పలు ఎన్నికలలో ప్రచారాస్త్రంగా కూడా వాడుకున్నారు. ఈ ప్రయత్నంలో కొన్ని విజయాలను కూడా అందుకున్నారు. తాజాగా తమ పార్టీకి చెందిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ బద్ధ శత్రువైన అదానీతో దోస్తీకి దిగటం కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సంకటంలో పడేసింది. మోదీ సహకారంతో విస్తరిస్తున్న అదానీ వ్యాపార సామ్రాజ్యం వల్ల దేశమంతా నష్టపోతున్నదని కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెడుతుండగా, అదే పార్టీకి చెందిన రేవంత్‌రెడ్డి మాత్రం తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఎర్రతివాచీ వేయడం ఆ పార్టీ నేతలకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డ చందంగా మారింది. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా గౌతమ్ అదానీతో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నారు. అంతకుముందు రేవంత్‌రెడ్డి ఆహ్వానంపైనే ఈ నెల 3న అదానీ కొడుకు కరణ్ అదానీ హైదరాబాద్ వచ్చి తెలంగాణలో పెట్టుబడులకున్న అవకాశాలపై చర్చించారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్ పెద్దలు దిక్కుతోచని స్థితికి నెట్టివేయబడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలవడం.. ఆ తరువాత అదానీని పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానించడంపై కాంగ్రెస్ పెద్దలు సమాధానం చెప్పుకోలేని స్థితికి చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, ఆ పార్టీ సీనియర్ నాయకుడు పీ చిదంబరం గురువారం ఢిల్లీలో తమ కమిటీ గురించి వివరించడానికి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 'కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఒకవైపు దేశ సంపదను ప్రధాని మోదీ తన ప్రియ మిత్రుడు అదానీకి దోచిపెడుతున్నారని ఆరోపణలు గుప్పిస్తుంటారు. మరి కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో అదానీతో ఒప్పందం కుదుర్చుకోవడం ఏమిటి?' అంటూ ఓ పాత్రికేయుడు చిదంబరాన్ని ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానం చెప్పక పోగా, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన ముందున్న మైక్‌ను పక్కనున్న పార్టీ నాయకురాలు సుప్రియా శ్రీనాథే వైపు తోసేయడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె కూడా మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా, తమ మ్యానిఫెస్టోకు సంబంధించింది ఏదైనా అడగాలంటూ దాటవేయడం వారి అగమ్యగోచరస్థితికి అద్దం పట్టింది. ఇప్పుడీ అంశం కాంగ్రెస్ వర్గాలలోనే కాకుండా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రేవంత్‌రెడ్డి వైఖరి కాంగ్రెస్ అగ్రనేతలను తీవ్ర ఇరకాటంలో పడేసిందనడానికి పార్టీ కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరం ప్రెస్‌మీట్‌లో కనబరిచిన అసహనమే అద్దం పడుతోందంటూ పలువురు పోస్టులు పెడుతున్నారు. మోదీ+ అదానీ= మోదానీ అన్న పోస్ట్ వైరల్ అయిన మాదిరిగా తాజాగా కొందరు రేవంత్ + అదానీ = రేవాని అంటూ పోస్టులు పెడుతున్నారు.